క్లుప్తంగా

కిశోర్‌కుమార్‌కు పోలీస్ సేవా పురస్కారం

నల్లగొండ టౌన్ : సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో ఆర్ముడ్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నల్లగొండ పట్టణానికి చెందిన డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్‌కు మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి పోలీస్ సేవా పురస్కారం అందజేసింది. శనివారం రాత్రి ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సమితి జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ చలమల హైమావతి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి.. కిశోర్‌కుమార్‌కు పురస్కారం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్‌కు చెట్ల కొమ్మలు తాకుతున్నందున వాటిని తొలగించేందుకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ సాయి గణేశ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమ్మర్ క్యాంప్‌కు చేయూత

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న చిన్నారులకు స్థానిక మాజీ సర్పంచ్ నూకల రఘునందన్‌రెడ్డి రూ. మూడు వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నవీన్‌రెడ్డి, చైర్మన్ మునుగోటి ఎస్తేర, ఉపాధ్యాయులు గోవర్ధన్, గోపయ్య, ఆదిత్యలు పాల్గొన్నారు.

నేడు విద్యా సదస్సు

నల్లగొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న శేషు స్మారక విద్యా సదస్సును విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పి.వెంకులు ఒక ప్రకటనలో కోరారు. సంఘం నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొనాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : నీలగిరి మున్సిపాలిటీలోని 20వ వార్డు పెద్దబండ ప్రాంతానికి చెందిన నీలకంఠం యాదగిరి (32) కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కాగా యాదగిరి మాతృమూర్తి లక్ష్మమ్మ తన కుమారుడికి కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది. అయితే చికిత్స కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో రూ.20,200 ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, నాగచారి, వంశీ, విక్రమ్, అనిల్, నైన్ నెట్ నరేందర్, సంతోష్, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వమే బీఎస్పీ లక్ష్యం

చిట్యాల: సమాజంలోని ప్రతిఒక్కరికీ సామాజిక సమానత్వం, ఆర్థిక సమానత్వమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేస్తోందని ఆ పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ దాగిళ్ల దయానందరావు అన్నారు. చిట్యాల మున్సిపాలిటీలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహుజన సమాజ్ పార్టీ అధికారంలో వస్తే రాష్ట్రంలో రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను పకడ్బందీగా అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 34 శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీ బలంగా ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జోనల్ కోఆర్డినేటర్ కత్తుల కాన్షీరాం, ఈజీ మెంబర్ గ్యార మారయ్య, చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షుడు అవిరెండి ప్రశాంత్ పాల్గొన్నారు.

చెట్లు నరికివేత

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో చెరువుకట్టకు ఉన్న వేపచెట్లను గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఓ కలప వ్యాపారికి అమ్మారు. దీంతో ఆదివారం సదరు కలప వ్యాపారి ఎలాంటి అనుమతి లేకుండా చెరువు కట్టకు ఉన్న వేపచెట్లను నరికివేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువుకట్ట వద్దకు వెళ్లి చెట్ల నరికివేతను అడ్డుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టూటౌన్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టడానికి వచ్చిన క్రీడాకారులకు ఆదివారం ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జలుబు, దగ్గు, చర్మవ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, ఎండీ. నజీరుద్దీన్ పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు

మర్రిగూడ : కొట్టాల గ్రామంలో మేడే వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి పార్టీ జెండా ఎగురవేశారు. కల్లెట్ల లింగయ్య, బుర్ర శేఖర్, గంట వెంకటేష్, రాజు, నరసింహ, వెంకటయ్య, రాము పాల్గొన్నారు.

కలగా మిగిలిన కళాభారతి !

- గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.90 కోట్ల నిధులు వెనక్కి
- సాహితీ వేదికలు లేక ఇబ్బందులు పడుతున్న కళాకారులు


జైపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కవులు, చిత్రంలో కోమటిరెడ్డి(ఫైల్)



నల్లగొండ పట్టణంలోని టౌన్ హాల్ (ఫైల్)

రామగిరి(నల్లగొండ): సాహిత్య సాంస్కృతిక కళారంగాల్లో ఘనమైన చరిత్ర కలిగిన జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు ఒక ఆడిటోరియం నిర్మాణం జరగకపోవడం శోచనీయం. జిల్లా కేంద్రంలో ఔట్ డోర్, ఇండోర్ స్టేడియాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించిన ప్రభుత్వం.. ఆడిటోరియం విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు కవులు, కళాకారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సూదిని జైపాల్‌రెడ్డి కేంద్ర సమాచార సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు మినీ రవీంద్రభారతి ఏర్పాటుకు రూ.2 కోట్లు మంజూరు చేశారు అదేవిధంగా జిల్లా కేంద్రంలో కూడా మినీ రవీంద్రభారతి (ఆడిటోరియం) ఏర్పాటుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. కానీ జిల్లా కేంద్రంలో మినీ రవీంద్రభారతి నిర్మాణానికి అనుకూలమైన స్థల సేకరణపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించారు. గడువు ముగిసినందున మంజూరైన రూ.2 కోట్ల నిధులు మిర్యాలగూడ, సూర్యాపేటకు పట్టణాలకు కేటాయించారు. ఈ విషయాన్ని అప్పటి స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు నల్లగొండ పట్టణంలో టౌన్ హాల్ ఉన్నప్పుడు ఆడిటోరియం అవసరం లేదని తేలిగ్గా కొట్టిపారేశారు.

1958లో టౌన్‌హాల్‌కు శంకుస్థాపన..

నల్లగొండలో టౌన్ హాల్‌ను ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1958లో శంకుస్థాపన చేశారు. ఇది శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉండడంతో ఇటీవల గ్రంథాలయ నిర్మాణం కోసం టౌన్ హాల్‌ను కూల్చివేశారు. ప్రస్తుతం మిర్యాలగూడలో మినీ రవీంద్ర భారతి ఏర్పాటు చేశారు కానీ జిల్లా కేంద్రంలో మాత్రం నిర్మించలేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలో కళాభారతి నిర్మాణం కోసం రూ.90 కోట్లు మంజూరైనట్లు జీఓ విడుదల చేసినప్పటికీ ప్రస్తుతం ఆ నిధులు రద్దు కావడంతో కళాభారతి నిర్మాణం కలగానే మిగిలిపోయింది.

సాహితీ ప్రియులకు తీరని లోటు



జిల్లా కేంద్రంలో కళాభారతి లేకపోవడం సాహితీ ప్రియులకు తీరని లోటు. జిల్లా కేంద్రంలో కళాభారతి నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నల్లగొండ చారిత్రకంగా విశిష్టత ఉన్న జిల్లా. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్నది. గొప్ప సాహిత్యం విలసిల్లిన నేల ఇది.

–పున్న అంజయ్య, సాహితీ మేఖల సంస్థ ప్రధాన కార్యదర్శి

కళాభారతి లేకపోవడం బాధాకరం



జిల్లా కేంద్రంలో కళాభారతి భవనం లేకపోవడం బాధాకరం. గతంలో కోర్టు ఎదురుగా టౌన్ హాలు ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చేశారు. కానీ దాని స్థానంలో మరో కొత్త భవనం నిర్మించలేదు. ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి పాత టౌన్ హాల్ స్థానంలో ఒక మంచి కళా భవనాన్ని నిర్మించాలి.

– పేరుమాళ్ల ఆనంద్, సృజన సాహితీ అధ్యక్షుడు

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి


పూజలో పాల్గొన్న ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, జాజుల శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు: ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కోతులారం గ్రామంలో కేదారేశ్వర ఆలయ ఉత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాలు, పండుగలతో గ్రామ ప్రజల్లో ఐక్యత పెరుగుతుందన్నారు. పురాతన ఆలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి చేస్తుందన్నారు. ఉత్సవాలకు హాజరైన ఎంపీకి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, కేదారేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాల, శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ వేడుకల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మండల మాజీ అధ్యక్షుడు సురిగి నర్సింహ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు జాజుల సత్యనారాయణ, భాస్కర్ గౌడ్, లింగస్వామి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

నకిరేకల్ : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ, కోరారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, నాయకులు చిలుముల రామస్వామి, వంగురి వెంకన్న, నాగార్జున, లింగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎండీ రబ్బాని, పెద్దగాని నరసింహ, కర్నాటి యాదయ్య, దుబ్బాక సాయిలు, ఖమ్మం పెద్ద యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చిన్నవెంకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బండపాలెం గ్రామంలో మేడే వారోత్సవాల్లో భాగంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం కట్ట ప్రభాత్, చౌగోని నాగయ్య, కన్నెబోయిన వీరేశ్, వంగూరు శేఖర్, నాగయ్య పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం


రామగిరి(నల్లగొండ): హోమంలో పాల్గొన్న భక్తులు, పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


చిట్యాల: ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్ నీలగిరి కాలనీలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జయంతి, కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుదర్శన నారసింహ హోమం, వేద పండితుల మధ్య కల్యాణ మహోత్సవం ఘనంగా జరిపించారు. వందలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో నీలగిరి కాలనీ దేవస్థాన అభివృద్ధి కమిటీ, నీలగిరి కాలనీ, సూర్యవంశీ కాలనీ, కనకదుర్గ కాలనీ, హిమగిరి కాలనీ, వెంకటరమణ కాలనీవాసులు పాల్గొన్నారు.

శంకర గోశాలలో నరసింహ జయంతి

నల్లగొండ పట్టణం పానగల్ రోడ్‌లోని శ్రీ శంకర గోశాలలో ఆదివారం శ్రీ ప్రహ్లాద వరద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి కనులపండువగా నిర్వహించారు. ఉదయం అభిషేకం మహాలక్ష్మి మహా సుదర్శన హోమం జరిపించారు. పాకిస్తాన్‌తో యుద్ధంలో మన సైనికులు అఖండ విజయం సాధించాలని సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో నూకల నరసింహారెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, రాజు, ట్రస్టు సభ్యులు, అర్చకులు ఫణీంద్ర శర్మ, భక్తులు పాల్గొన్నారు.

శ్రీబాలనర్సింహస్వామి ఉత్సవాలు ప్రారంభం

చిట్యాల: పట్టణంలోని శ్రీ బాలనర్సింహస్వామి వార్షిక ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని శివాలయం నుంచి అందంగా ముస్తాబు చేసిన ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పట్టణ శివారులో శ్రీ బాలనర్సింహస్వామి ఆలయం వరకు డప్పుచప్పుళ్లు, భజనలతో తీసుకెళ్లారు.

ఉపాధ్యాయుడు తుల శ్రీనివాస్‌కు జాతీయస్థాయి అవార్డు



నకిరేకల్ : పట్టణానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు తుల శ్రీనివాస్ జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. చక్రవర్తుల రాధాకృష్ణారావు సాహితీ వేదిక వరంగల్ ఆధ్వర్యంలో ।అమ్మకు ప్రేమతో। అంశంపై జాతీయ స్థాయి లేఖా రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తుల శ్రీనివాస్ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచారు. త్వరలో వరంగల్‌లో జరగనున్న కార్యక్రమంలో శ్రీనివాస్‌కు అవార్డు ప్రదానం చేయనున్నట్లు పోటీల నిర్వాహకులు చక్రవర్తుల శ్రీనివాస్, డాక్టర్ మడత భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.రూ.5,116 నగదు, శాలువా, మెమోంటోతో సత్కరిస్తారని వెల్లడించారు. శ్రీనివాస్‌ను కవులు మునాసు వెంకట్, పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, సారంగి వెంకన్న, భానుశ్రీ కోత్వాల్ తదితరులు అభినందించారు. శ్రీనివాస్ ప్రస్తుతం నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కట్టంగూర్ : మండలంలోని కల్మెర గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఏఎస్ఐ అఫ్జల్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కల్మెర గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి నలుగురిని పట్టుకుని వారినుంచి రూ.2520 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిని బాలకృష్ణ, రాజశేఖర్ రెడ్డి, నరేందర్, శ్రీనుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

ఎట్టకేలకు డ్రెయినేజీ నిర్మాణం పూర్తి


పూర్తయిన డ్రెయినేజీ పనులు

సాక్షి ఎఫెక్ట్...

నకిరేకల్ : పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సాక్షి దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు ఎట్టకేలకు పనులు పూర్తి చేశారు. నకిరేకల్ పట్టణంలో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ కోసం రూ.26 కోట్లు మంజూరయ్యాయి. వీటితో ప్రధాన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ పనులు చేపట్టారు. అయితే శ్రీ కనకదుర్గ ఆలయం సమీపంలో రోడ్డు వెంట డ్రెయినేజీ నిర్మాణం కోసం దుకాణాలు ఎదుట జేసీబీతో తవ్వారు తప్ప పనులు చేపట్టలేదు. రెండేళ్ల క్రితం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ దుస్థితిపై సాక్షి దిన పత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు మున్సిపాలిటీ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులను పూర్తి చేయించారు.

జాతరకు సౌడమ్మ ఆలయం ముస్తాబు


ఆలయంలో కొలువైన సౌడమ్మ దేవత

కేతేపల్లి: మండల కేంద్రంలో లింగమంతులస్వామి, సౌడమ్మ జాతర నిర్వహణకు స్థానిక యాదవ సంఘం నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే జాతరను సోమవారం తెల్లవారుజాము నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. దాతల సహకారంతో శ్రీసౌడమ్మ, లింగమంతుల స్వామి, పోతురాజు ఆలయాలను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. జాతరలో భాగంగా స్థానిక యాదవులంతా సామూహికంగా సోమవారం తెల్లవారుజామున ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మాణిక్యమ్మ వేషధారణ, పట్నం ముగ్గు, పొడుపు గొర్రె కార్యక్రమాలు నిర్వహించడంతో జాతర ముగుస్తుందని పేర్కొన్నారు.

కనీలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి


కనీలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జగదీశ్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

దేవరకొండ : దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనీలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కనీలాల్ నాయక్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని దేవరకొండ మండలం రత్యతండాలో ఏర్పాటు చేసిన కనీలాల్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రత్యతండా పంచాయతీగా ఏర్పడ్డ మొదట్లో మొట్టమొదటి సర్పంచ్‌గా ఎన్నికై ప్రజాసంక్షేమం కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజా క్షేత్రంలో ఉన్న నాయకులు వారు చేసిన సేవలతోనే ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య కిశోర్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఉన్నారు.

16న మండల మహాసభ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఈ నెల 16వ తేదీన సీపీఐ 7వ మండల మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు బొడిగె సైదులుగౌడ్ తెలిపారు. చిట్యాలలో ఆదివారం మహాసభలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. మండల మహాసభలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, నాయకులు దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, బొల్గూరి లింగయ్య, రావుల చినవెంకన్న, శివ పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి మాతృమూర్తికి నివాళి

నాంపల్లి : మాజీ జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి మాతృమూర్తి నర్సమ్మ దశదిన కర్మ పసునూరులో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, భూపాల్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీని ఓదార్చారు.

పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించాలని పూజలు

శాలిగౌరారం: పాకిస్తాన్‌తో చేస్తున్న యుద్ధంలో భారతదేశం విజయం సాధించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోద్, ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించాలి

మునుగోడు: గ్రామాల్లో నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుర్జ రామచంద్రం, బొల్గూరి నర్సింహ కోరారు. ఆదివారం మండలంలోని పులిపలుపుల, పలివెల గ్రామాల్లో నిర్వహించిన సీపీఐ గ్రామ మహాసభల్లో వారు పాల్గొని మాట్లాడారు. నేటికీ పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కనీసం వితంతువులకు పెన్షన్లు కూడా మంజూరు కావడం లేదని ఆరోపించారు. ఈ నెల 15న సింగారం గ్రామంలో నిర్వహించే సీపీఐ మండల మహాసభకు ప్రతి కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు, గోసుకొండ కృష్ణయ్య, కాయితం వెంకన్న, బొల్గూరి ఎల్లయ్య, గుండెబోయిన భాస్కర్, సింగం యాదయ్య, పందుల యాదయ్య, మండలంలోని సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే వేడుకలు

నకిరేకల్ : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వాసవి కపుల్స్ క్లబ్, వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తల్లిదండ్రులకు వారి పిల్లలతో పాదపూజ చేయించారు. ఈ వేడుకల్లో క్లబ్ ఐపీసీ ప్రతినిధిలు ఉప్పల వెంకటరమణ, దేవర సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్, ఆయా క్లబ్‌ల అధ్యక్షులు గుడిపాటి రవి, తేలకుంట్ల రాజు, కందగట్ల శ్వేత, ప్రతినిధులు కందగట్ల బాలాజీ, వజ్రపు సంతోష్, రేపాల పరిమళ, బ్రహ్మదేవర వేణు, తేలుకుంట్ల శోభారాణి, స్వప్న, హైమావతి, రాచకొండ శ్రీను, పద్మ, గుడిపాటి లక్ష్మీ, వనమ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నకిరేకల్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


శాలిగౌరారం : వల్లాలలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నకిరేకల్ : పట్టణంలోని నేతాజీ ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వంగాల ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం నంద్యాల సురేష్‌రెడ్డి, డైరెక్టర్ సత్తిరెడ్డిలతోపాటు తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తడిసిన మధుసూదన్‌రెడ్డి, సమ్మెట తిరుమలేష్, మారం అరుణ, గునగంటి శ్రీనివాస్, రామకృష్ణ, కరుణాకర్‌రెడ్డి, చిత్తలూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలో..

శాలిగౌరారం: మండలంలోని వల్లాల, మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటూ మండల కేంద్రానికి చెందిన విజ్ఞానజ్యోతి హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆయా గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. వల్లాల జెడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, మాధారంకలాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, శాలిగౌరారంకు చెందిన విజ్ఞానజ్యోతి హైస్కూల్ 2004–05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.


శాలిగౌరారం : మాధారంకలాన్‌లో ..


శాలిగౌరారం: విజ్ఞానజ్యోతి హైస్కూల్‌లో ..

దొడ్డి కొమరయ్య సినిమా పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్‌ను ఆదివారం గడియారం సెంటర్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్ నేలపట్ల రమేష్‌లు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన కొమరయ్యపై సినిమా తీయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో చీర పంకజ్‌యాదవ్, కాసోజు విశ్వనాథం, దుడుకు లక్ష్మీనారాయణ, చిక్కుల్ల రాములు, కాశయ్యగౌడ్, విజయ్, సీతారాములు, ఆనంద్‌కుమార్, శ్యాంసుందర్, దామోదర్, గిరిధర్, రాజారావు, కృష్ణ, లలిత, అబ్దుల్ రెహమాన్, రాజకుమారి, వెంకటేశ్వర్లు, లక్ష్మి, శ్రీనివాస్, రాము, జగదీష్, బాలాజీ, రంగనాయకమ్మ, యామిని, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

నకిరేకల్ : పట్టణంలోని గురు మందిరంలో విశ్వ హిందూ పరిషత్, మాతృశక్తి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించిన వేసవి బాల సంస్కార్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ శిక్షణలో వంద మందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. రామాయణం, నిత్య ప్రార్థన శ్లోకాలు, హనుమాన్ చాలీసా, ఆటలు, వ్యాయామం, కథలు, దేశభక్తి గీతాలు, కోలాటం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉమాకర్, మాతృశక్తి కన్వీనర్ పద్మశ్రీ, విశ్వహింద్ విభాగ్ కన్వీనర్ సత్యవతి, ప్రఖండ అధ్యక్షుడు మన్మథరెడ్డి, రవి శంకర్, కల్పన, సంధ్య, జ్యోతి, సులోచన, రమ్య, హరిత పాల్గొన్నారు.